వృథాగా సాగునీరు

- పెద్దచెరువు పడమటి తూం కు పగుళ్లు
- పట్టించుకోని నీటి పారుదల శాఖ అధికారులు

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువుకు సంబంధించిన పడమటి తూం పగుళ్ల కారణంగా కొన్ని రోజులుగా సాగునీరు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేని దుస్థితి ఏర్పడింది. అమరచింత పెద్ద చెరువు పరిధిలో 360 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. కొన్నేళ్లుగా భూత్పూర్ రిజర్వాయర్ ద్వారా సాగునీరు చెరువుకు అందుతుండటంతో.. ఆయకట్టు రైతులు ఏడాదిలో రెండు పంటలు సాగు చేస్తున్నారు. రైతులతో పాటు చేపలను పెంచుకుంటూ చెరువు మీద ఆధారపడి సుమారు 200 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. మండలంలోనే అతిపెద్దదైన చెరువును ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ఆయకట్టు రైతులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా పట్టించుకునే నాయకులే కరువయ్యారు. ప్రస్తుతం చెరువు ఆయకట్టు పరిధిలో యాసంగిలో వరిపంటను సాగు చేశారు. ఇందుకు గాను చెరువు కాల్వలలో పూడికను తొలగించుకునేందుకు రైతులు సమిష్టిగా ఏర్పడి ఎకరానికి రూ.500 ఖర్చు చేస్తూ పూడికను తొలగించారు. చెరువు మొత్తంలో మూడు తూంలు ఉన్నాయని, వాటికి సంబంధించిన గేట్లు సైతం మరమ్మతులకు నోచుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.


చెరువుకట్టకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు

నెర్రెలు బారుతున్న చెరువు కట్ట

చెరువు ప్రధాన ఆనకట్ట నెర్రెలు వారుతున్నా నీటి పారుదల శాఖ అధికారులు వాటిని గుర్తించలేకపోతున్నారు. వీటికి తోడు ఆనకట్టకు ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో రైతుల ద్విచక్రవాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అమరచింత మున్సిపాలిటీగా ఏర్పడటంతో ముళ్లపొదలను ఈజీఎస్ ద్వారా తొలగించలేని దుస్థితి ఏర్పడింది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు వందరోజుల పనులతో చెరువులో పూడికతో పాటు ముళ్లపొదలను తొలగించేవారని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి పడమటి తూం మరమ్మతు పనులు వెంటనే చేపట్టాని కోరుతున్నారు.


తూం కు ఏర్పడిన పగుళ్లు

క్లుప్తంగా

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ప్రతి విద్యార్థి ప్రార్థనకు హాజరయ్యేలా చూడాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ సందర్శించి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులందరూ యూనిఫాంతో హాజరుకావడంపై ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వెంకట్‌నారాయణ, వెంకటేష్‌యాదవ్, ప్రేమ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి మాలధారుల పాదయాత్ర



పాన్‌గల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన శివ మాలధారులు శనివారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. ముందుగా గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాలధారులు ఇరుముడి కట్టుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదయాత్రకు వెళ్తున్న మాలధారులను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆలయం నుంచి సాగనంపారు.

మౌలానా సేవలు మరువలేనివి

వనపర్తిటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు దేశం ఎన్నిటికీ మరచిపోదని ప్రజావాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, నాయకంటి నరసింహాశర్మ, నాగరాజు, బండలయ్య, బాలేమియా, భగవంత్‌రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా



కేటీదొడ్డి: రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో విద్యుత్‌ను వినియోగించుకోవాలన్నారు. శనివారం మండలంలోని మల్లాపురంతాండలోని సిద్దన్‌పల్లి గ్రామ శివారులో రూ.83 లక్షల వ్యయంతో 33 కేవీ కొత్తలైన్ నిర్మాణ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గద్వాల ప్రాంత రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. కరెంటు లేక సరైన పంటలు లేక అప్పుల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉన్నాయన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి మండలంలో ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశామన్నారు. భవిష్యత్‌లో గద్వాల నియోజకవర్గంలోని ఏ గ్రామంలో కూడా లో ఓల్టేజ్ సమస్య లేకుండా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీ రమేష్ బాబు, ఏఈ అనిల్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, రామకృష్ణనాయుడు, నాయకులు చక్రధర్, రామకృష్ణరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన ధర చెల్లించాలి

అలంపూర్ రూరల్: బుక్కాపురానికి వెళ్లే మార్గంలోని బొమ్మిడాల కంపెనీ యాజమాన్యం గిట్టుబాటు ధర కల్పించకుండా అన్యాయం చేస్తుందని బీడీ పొగాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని కాశీపూరం, లింగన్‌వాయి, కోనేర్ రైతులు బీడీ పొగాకు విక్రయించేందుకు శనివారం రాగా యాజమాన్యం నమ్మించి మోసం చేస్తుందని ఆరోపిస్తున్నారు. రూ.15,000 ఇవ్వాల్సిన వాటికి రూ.13,000 నుంచి 13,500 ధర ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మిడాల కంపెనీ దగ్గరే విత్తనాలు, మందులు కొని పంట వేసినట్లు తెలిపారు. తీరా గిట్టుబాటు ధర కల్పించకుండా ఇష్టానుసారంగా ధరలు తగ్గించేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగా కంపెనీ సిబ్బంది అశోక్, బయ్యర్ భద్రం మాట్లాడుతూ.. పొగాకు ప్యాకేజీ చేస్తున్నప్పుడే గ్రేడింగ్ చేసుకోని రావాలని, బాగలేని సరుకును సీఆర్ చేస్తున్నామని తెలిపారు. పొగాకు బాగలేనందుకు కొంత ధర తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘యూరియా కొరత సృష్టిస్తే చర్యలు’

ఖిల్లాఘనపురం: మండలంలో రైతులకు కావాల్సిన యూరియా, డీఏపీ తదితర అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, కొరత ఉన్నట్లు రైతులకు తప్పుడు సమాచారం ఇచ్చే ఫర్టిలైజర్ షాపులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య అన్నారు. శనివారం ఆయన మండలంలోని ఎరువుల దుకాణాలతో పాటుగా సింగిల్‌విండో, ఆగ్రో దుకాణాలను పరిశీలించారు. దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువుల బస్తాల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇటీవల కొన్ని దుకాణాల వారు యూరియా లేదని, గుళికలు తదితర వేరే మందులు కొన్నవారికే యూరియా ఇస్తామని చెప్పినట్లు కొందరు రైతులు తమదృష్టికి తీసుకొచ్చారన్నారు. మండలంలో శనివారం అన్ని దుకాణాల్లో కలిపి మొత్తం 296 మెట్రిక్ టన్నుల యూరియా, 30 టన్నుల డీఏపీ, కాంప్లెక్స్ 176 టన్నులు, పొటాష్ 81 టన్నులు, సూపర్ 35 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. వీటితో పాటు మార్క్‌ఫెడ్‌లో అదనంగా సుమారు 500 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఎవరైనా యూరియా లేదని రైతులను ఇబ్బందులకు గురిచేసిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వారం 10 దుకాణాలను ప్రత్యక్షంగా తనిఖీ చేసి స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నామని స్పష్టం చేశారు.


సోళీపురంలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ మల్లయ్య

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


టీకాలపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ రామయ్య

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించేలా సిబ్బంది తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సీహెచ్‌ఓ రామయ్య సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని జమ్మాపూర్ సబ్‌సెంటర్‌ను సందర్శించి రెగ్యులర్‌గా వేసే వ్యాధి నిరోధక టీకాల వివరాలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు టీకాలు వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్‌లో అంటు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. దీంతో పాటు గర్భిణులకు సరైన సమయంలో మొదటి, రెండో డోస్ టీటీ వ్యాక్సిన్ వేయించుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకుంటే కాన్పు సమయంలో ఇబ్బందులు ఎదురుకావని సూచించారు. ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకునేలా సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన పూజలు

వనపర్తి టౌన్: పట్టణంలోని వీరాంజనేయ విగ్రహ పునఃప్రతిష్ఠాపనలో భాగంగా రెండో రోజైన శనివారం ఆవాహిత దేవతామూర్తులకు ధాన్యాదివాసం భక్తిశ్రద్ధలతో శ్రీరామ నామస్మరణతో ప్రజలు ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. మూలమంత్రాలతో ఆవాహనం చేసిన వీరాంజనేయ, మహాదేవుడు (శివలింగం), నవగ్రహాలు, నాగప్రతిష్ఠ మూర్తులకు భక్తులు తెచ్చిన వడ్లు, బియ్యంతో ధాన్యాదివాసం శాస్త్రోక్తంగా చేపట్టారు. శనివారం రాత్రి ఎనిమిది కలశాలు, ఓ నిద్ర కలశంతో దేవతామూర్తులను నిద్రపుచ్చేందుకు చేతి కర్ర, అద్దం, తదితర సంప్రదాయ వస్తులను విగ్రహాల వద్ద ఉంచి వాటిపై దుప్పటి కప్పి శయదీవాసం క్రతువు చేపట్టారు.

ఉదయం నుంచే హోమాలు

శనివారం ఉదయం నుంచి చేపట్టిన పూజలు, హోమాలతో వనపర్తి పాత పట్టణం ఆంజనేయ, శ్రీరామ నామస్మరణతో నిర్విరామంగా హోమాలు చేపట్టారు. ప్రాతఃకాలంలో ఆవాహిత దేవత హోమం, యోగిని మండప దేవతా హోమాలు, వాస్తు మండప దేవతా హోమాలు, క్షేత్రపాలక మండప హోమాలు, నవగ్రహ మండప దేవతా హోమాలు, మూలమంత్ర హోమాలు, మన్యసూక్త హోమం, రుద్ర, పురుష సూక్త, మూలమంత్ర సహిత, ఆదివాస హోమాలు, దేవతామూర్తుల ఆవాహన మంత్రోచ్ఛరణల మధ్య పాత పట్టణం మార్మోగింది. మధ్యరాత్రి వరకు ఆగమశాస్త్రం ప్రకారం వేద పండితులు జోషి ప్రశాంత్‌శర్మ నేతృత్వంలో ధీరజ్‌శర్మ, శాంతికుమార్ శర్మ, నరేందర్‌శర్మ పూజలు చేయించారు. ఆదివారం ధ్వజస్తంభం, మూలవిరాట్‌ల పునఃప్రతిష్ఠతో నిత్యం దేవతామూర్తుల దర్శనం కల్పించనున్నట్లు అర్చకులు తెలిపారు.

విద్యార్థులకు పెన్ను, ప్యాడ్ల అందజేత


విద్యార్థులకు పెన్ను, ప్యాడ్లు అందజేస్తున్న జేఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు

కొత్తకోట రూరల్: కొత్తకోటలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో జేఎస్ రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదో తరగతిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కోసం రెండు నెలలుగా విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్ తెలిపారు. శనివారం విద్యార్థులు అర్హత పరీక్ష రాస్తున్న సందర్భంగా శిక్షణ పొందిన వారందరికీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జేఎం మిషేక్ ఆధ్వర్యంలో పెన్నులు, ప్యాడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు అమృతరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ప్రవేశ పరీక్షల్లో ప్రతి ఒక్కరూ సీటు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఏ అనిల్, భాను, కర్ణ కుమార్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కొత్తకోట సమీపంలో జాతీయ రహదారి 44పై చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కొత్తకోట సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న రోడ్డు పక్కన గల ఓ దాబాకు సమీపంలో గుర్తు తెలియని 45 నుంచి 50ఏళ్ల వయస్సు గల మగ మనిషిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని సమాచారం వచ్చింది. పోలీసులు అక్కడి వెళ్లి చూడగా మృతదేహంపై వాహనాలు వెళ్లడంతో నుజ్జునుజ్జు కావడంతో గుర్తు పట్టలేని విధంగా తయారయ్యిందని, మృతి చెందిన వ్యక్తి గురించి మండలంలోని వివిధ గ్రామాల్లో సమాచారం లభించలేదు. మృతదేహాన్ని ఆటోలో వనపర్తి మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక

ఖిల్లాఘనపురం: పదో తరగతి వార్షిక పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణతతో పాటుగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని తెలంగాణ మోడల్‌పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి అన్నారు. శనివారం పాఠశాల, కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించగా.. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతు జిల్లాలో ఖిల్లాఘనపురం మోడల్ పాఠశాలకు మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రతి ఏడాది పదో తరగతితో పాటుగా ఇంటర్‌లోనూ 100 శాతం ఉత్తీర్ణతతో జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.


ఖిల్లాఘనపురం మోడల్ పాఠశాలలో గిరిజన సంప్రదాయంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వంద శాతం ఫలితాలు సాధించాలి..

చిన్నంబావి: మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు వెంకట్రమణమ్మ అన్నారు. ఆమె శనివారం పాఠశాలను సందర్శించి, ఎస్‌ఓ ను సన్మానించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు.

పరమేశ్వరస్వామి జాతర పోస్టర్లు విడుదల


జాతర పోస్టర్లను విడుదల చేస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, భక్తులు వేలాదిగా తరలిరావాలని నిర్వాహకులు కోరారు. శనివారం స్థానిక అతిథిగృహం వద్ద జాతర పోస్టర్లను విడుదల చేశారు. మార్చి 1, 2, 3 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరుమహోత్సవం కనులపండుగగా జరుగనుందని వారు తెలిపారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ వెంకటనర్సింహారావు, వైస్‌చైర్మన్ ఏపూరి యాదగిరిశెట్టి, ప్రధానకార్యదర్శి సాయిరాఘవ, కోశాధికారి మణివర్ధన్‌రెడ్డి, సహాయకార్యదర్శి తెలుగు నాగేష్ మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు. మార్చి 3వ తేదీన కబడ్డీ పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, రామలక్ష్మారెడ్డి, షబ్బీర్, దామోదర్, నాగేష్, మహేష్, గంగ, శంశీర్, దేవన్న, వెంకటన్న తదితరులు ఉన్నారు.

నీటి వసతి లేక మరుగుదొడ్లు నిరుపయోగం

- మహిళా సమాఖ్య సభ్యులకు తప్పని ఇబ్బందులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో నీటి వసతి లేక మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. దీంతో సమాఖ్య సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకే మండల మహిళ సమాఖ్య, కార్యాలయం మండల కేంద్రానికి దూరంగా ఉండటం, సరైన నీటి వసతి లేకపోవడంతో మహిళలు అత్యవసర సమయంలో ఆరుబయటకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండల మహిళా సమాఖ్య భవనానికి నీటి సౌకర్యం కల్పించి మరుగుదొడ్లు, మూత్రశాలలను వినియోగంలోకి తీసుకురావాలని మహిళలు కోరుతున్నారు.


మూతపడిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

సీపీఎం నాయకుడికి ఘన నివాళి

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు నర్సింహ పార్టీ సిద్ధాంతాల కోసం పనిచేస్తూ నక్సలైట్ల బాంబు దాడుల్లో అమరులయ్యారని, వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిర్వహించిన ఎన్నో ఉద్యమాలలో నర్సింహ ముందు వరుసలో నిలబడి పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటయ్య, మాచర్ల వెంకటేశ్వర్‌గౌడ్, బాలస్వామి, ఆశన్న, ఈశ్వర్, రాముడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నర్సింహ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

‘పన్నులు కాదు.. సౌకర్యాలు కల్పించాలి’

వనపర్తి విద్యావిభాగం: పట్టణంలో పన్నుల బాదుడు మాని, ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గతంలో అక్రమంగా తీర్మానం చేసిన చెత్త సేకరణ పన్ను రద్దు చేయాలని, అలాగే వార్డుల్లో అనవసరపు బోర్లు, వన్ ఇంచ్ పైపులైన్ల అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా గతంలో పక్క రాష్ట్రంలో చెత్త సేకరణపై పన్ను విధిస్తే ఇక్కడున్న మున్సిపాలిటీ కూడా తీర్మానం చేసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గద్వాల, మహబూబ్‌నగర్‌లో చెత్త పన్ను సేకరణ ఎత్తివేశారని గుర్తుచేశారు. వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి సతీష్, గొనికాడి యాదయ్య, శివకుమార్, రమేష్, వేణు, యాదగిరి, నరసింహ పాల్గొన్నారు.

అధికార పార్టీలో విభేదాలు

- నిలిచిన మార్కెట్‌యార్డ్ శంకుస్థాపన
- రెండు గ్రూపులు.. రెండు గ్రామాల్లో శిలాఫలకం కోసం ఏర్పాట్లు

ఖిల్లాఘనపురం: మండలంలో ఏర్పాటు చేసే మార్కెట్ యార్డు విషయంలో అధికార కాంగ్రెస్ నాయకులు మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఖిల్లాఘనపురం, పెద్దమందడి మండలాల రైతుల ఆకాంక్ష మేరకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వ్యవసాయ మార్కెట్ యార్డు మంజూరు చేయించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, టూరిజం శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా మార్కెట్ యార్డు కోసం ఈ నెల 22న శంకుస్థాపన చేయించేందుకు ఎమ్మెల్యే ఏర్పాట్లు చేశారు. మండలంలోని షాపురం స్టేజీ సమీపంలో షాపురం శివారులోని సర్వే నెంబర్ 267లో మార్కెట్ యార్డు కోసం శంకుస్థాపన చేయించేందుకు శుక్రవారం కొందరు నాయకులు భూమిని చదును చేయించారు.

అసంతృప్తి వ్యక్తం చేసిన నాయకులు

స్థల పరిశీలనలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యేతో పాటుగా డీసీసీబీ ఉమ్మడి జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులుగౌడ్ మండలానికి వచ్చారు. కానీ కొందరు నాయకులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో.. ఎమ్మెల్యే వారి సముదాయించి ఖిల్లాఘనపురం శివారులో స్థలం ఉంటే అక్కడే మార్కెట్ యార్డు నిర్మాణం చేపడదామని హామీ ఇచ్చారు. సోడమ్మ గుట్ట వద్ద సర్వే నెంబర్ 29లో ప్రభుత్వ భూమి ఉందని చెప్పడంతో ఎమ్మెల్యే స్థలాన్ని పరిశీలించి, అక్కడే మార్కెట్‌యార్డు నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.


షాపురం స్టేజీ వద్ద శంకుస్థాపనకు దిమ్మె నిర్మిస్తున్న నాయకులు

రాత్రికి రాత్రే..

మండల కేంద్రంలోనే మార్కెట్‌యార్డు ఏర్పాటుకు అంగీకరించని షాపురం, మానాజీపేట తదితర గ్రామాల నాయకులు రైతులతో కలిసి శుక్రవారం రాత్రి వనపర్తిలో ఎమ్మెల్యేను కలిసి తమ అభ్యంతరాలను వివరించారు. దీనిపై ఏకాభిప్రాయం వచ్చిన తర్వాతే శంకుస్థాపన పనులు చేపడదామని ఎమ్మెల్యే రాత్రికి రాత్రే కార్యక్రమాన్ని రద్దు చేయించారు. కానీ కొందరు నాయకులు శనివారం షాపురం వద్ద చదును చేసిన స్థలంలో శిలాఫలకం కోసం దిమ్మె ఏర్పాటు చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేశారు. మండలానికి మంత్రులు, ఎంపీ వస్తున్నారని ప్రచారం జరగడం, శనివారం ఉదయం కార్యక్రమం రద్దు చేయడంతో.. ఈ విషయాలు తెలియని స్థానికులు గందరగోళానికి గురయ్యారు.

కొట్టినోళ్లకే వంత పాడుతున్నరు..

గోపాల్‌పేట: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఆయనపై కర్రలతో దాడి చేసిన వారి పక్షానే ఇప్పుడు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎద్దేవా చేశారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిన్నారెడ్డి బీఆర్ఎస్ మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో జంగమాయపల్లిలో ఓ ఇంట్లో కూర్చొని మాట్లాడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రజలు చందాలు వేసుకుని నిర్మించిన సీసీ రోడ్డుకు బీఆర్ఎస్ నాయకులు బిల్లులు పెట్టుకుంటే.. చిన్నారెడ్డి ఆ బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌కు సూచించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి రూ.850 కోట్లు మంజూరు చేయించి పనులు చేస్తుంటే ప్రతిపక్షాలతో కలిసి అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇంచార్జి సత్యశీలారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.


గోపాల్‌పేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

మార్కెట్ యార్డు శిలాఫలకం ప్రారంభం..

ఏదుల, గోపాల్‌పేట మండలాలకు కలిపి వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణానికి శనివారం బుద్ధారం గండి సమీపంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు గోపాల్‌పేట మండల కేంద్రంలో మార్కెట్ యార్డు నిర్మించాలని కోరేందుకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గోపాల్‌పేట బస్టాండులో నిలిచి ఉండగా.. పక్క నుంచే మంత్రి తుమ్మల కాన్వాయ్ వెళ్లింది. బుద్ధారం గండిలో పూజలు చేసిన తుమ్మల చిన్నారెడ్డిని లోపలికి పిలిపించి మాట్లాడారు. ప్రస్తుతానికి ప్రారంభోత్సవానికి సహకరించాలని ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయం తర్వాత చర్చించుకోవాలని తుమ్మల, మల్లు రవి వారికి సూచించారు.